క్లుప్తంగా

వైభవంగా బ్రహ్మోత్సవాలు



వేంకటేశ్వరస్వామివారిని హనుమంతుని వాహనంపై ఊరేగిస్తున్న ఆలయ నిర్వాహకులు

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో కొలువైన పద్మావతి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో బ్రహ్మోత్సవాలు సోమవారానికి నాలుగో రోజుకు చేరుకున్నాయి. స్వామికి విశేష పూజలు జరిపారు. వేదపండితుల ఆధ్వర్యంలో స్వామికి అత్యంత వైభవంగా పూజలు జరిపారు. ఆలయ ధర్మకర్త గణేశుల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో స్వామిని హనుమంతుని వాహనంపై ఊరేగించారు. తిరుప్పావడ, వసంతోత్సవం, పూలంగి సేవ, ఊంజల్ సేవ, ఏకాంత సేవ వంటి విశేష సేవలు జరిపారు. స్వామికి విశేష కైంకర్యం చేశారు. కోలాటం ఏర్పాటు చేశారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

నృసింహుని దీక్షాధారణ



అంతర్వేది దేవస్థానంలో నృసింహుని మాలధారణ చేపడుతున్న భక్తులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో సోమవారం నృసింహ భక్తులు అధిక సంఖ్యలో స్వామివారి స్వాతి నక్షత్ర దీక్షామాలధారణ చేపట్టారు. తొలుత స్థానాచార్య వింజమూరి రామ రంగాచార్యుల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు స్వామివారి నక్షత్ర దీక్షా మాలాధారులతో స్వామికి ప్రత్యేక అభిషేకం చేయించారు. తదనంతరం రంగాచార్యుల పర్యవేక్షణలో భక్తులకు మాలధారణ అర్చకులు చేశారు. దీక్షాధారులకు, వెంట వచ్చిన భక్తులుకు తీర్థప్రసాదాలను అర్చకులు అందజేశారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లును ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యానారాయణ చేశారు. కాగా 27 రోజులు నక్షత్ర దీక్షామాలధారణ చేపట్టి భక్తులచే దీక్షా విరమణ కార్యక్రమాన్ని మే నెల 11వ తేదీన (నృసింహ జయంతి) నిర్వహిస్తామని స్థానాచార్య రామరంగాచార్యులు అన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలు



పోతవరంలో గురుస్వామి మట్టపర్తి పండు ఆధ్వర్యంలో జరిగిన రక్తదాన శిబిరం

పి.గన్నవరం: పోతవరం గణేష్ నగర్‌లో గురుస్వామి మట్టపర్తి పండు ఆధ్వర్యంలో సోమవారం అయ్యప్పస్వామి జన్మదినం సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప స్వామికి అభిషేకాలు, హోమాలు, పడిపూజ తదితర పూజలు జరిగాయి. వివిధ గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామికి పూజలు చేశారు. భక్తులకు పెద్ద ఎత్తున అన్న సమారాధన చేశారు. రక్త దాన శిబిరం నిర్వహించారు. పలువురు యువకులు రక్త దానం చేశారు. అమలాపురానికి చెందిన సహస్ర బ్లడ్ బ్యాంక్ సిబ్బంది రక్తాన్ని సేకరించారు. కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, సర్పంచ్ వడలి కొండయ్య, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రావులమ్మ జాతర

అయినవిల్లి: గ్రామదేవతగా పూజలందుకుంటున్న రావులమ్మ వారి జాతర సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి గ్రామోత్సవం జరిపారు. గరగ నృత్యాలు, చిత్రవిచిత్ర వేషధారణలు, గారడీ నృత్యాలు ఏర్పాటు చేశారు. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని కానుకలు, మొక్కులు చెల్లించారు.

స్టడీ మెటీరియల్ అందజేత



స్టడీ మెటీరియల్ అందుకున్న విద్యార్థులు

మామిడికుదురు: కోనసీమ జిల్లా బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మొగలికుదురులో నిర్వహిస్తున్న ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్ సెంటర్‌లో చదువుకుంటున్న 60 మంది విద్యార్థులకు సోమవారం ఉచితంగా స్టడీ మెటీరియల్ అందజేశారు. పి.గన్నవరం మండలం పోతవరానికి చెందిన రిటైర్డ్ హెచ్ఎం కత్తుల ఆనందరావు ఈ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బొక్కా వీరవెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు కారాడు వెంకటనరసింహరాజు, మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు నయనాల రఘురామయ్య, రాయుడు శ్రీనివాసు, పి.గన్నవరం మండల శాఖల అధ్యక్ష, కార్యదర్శులు కట్టా రవికుమార్, కాపవరపు గోపాలకృష్ణ, బీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.



అంబాజీపేట బస్టాండ్ వద్ద అంబేడ్కర్‌కు **పూలమాల వేస్తున్న కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు**



మలికిపురం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో **అంబేడ్కర్ జయంతి వేడుకల్లో గొల్లపల్లి**



రాజోలులో అంబేడ్కర్ చిత్రపటానికి **నివాళులర్పిస్తున్న న్యాయమూర్తి ప్రమీలరాణి**



ఆలమూరులో అంబేడ్కర్ చిత్రపటానికి **పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రజా ప్రతినిధులు**

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

- **అట్టహాసంగా అంబేడ్కర్ జయంతి**
- **నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు**

పి.గన్నవరం: అంబేడ్కర్ అడుగుజాడల్లో అందరూ పయనించి, ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. అంబేడ్కర్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పి.గన్నవరం మూడు రోడ్ల సెంటర్లో సోమవారం అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. ఆయన విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ యువజన సంఘ నాయకుడు కోట విజయభాస్కర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సర్పంచ్ బొండాడ నాగమణి, నాయకులు సాధనాల రమేష్, కొక్కిరి రవికుమార్, కోట రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు. అంబేడ్కర్‌ను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మూడు రోడ్ల సెంటర్లో గన్నవరపు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, మందపాటి కిరణ్‌కుమార్ తదితరులు అంబేడ్కర్‌కు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. మండల పార్టీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో అంబేడ్కర్ యువజన సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు.

కొత్తపేటలో..

కొత్తపేట: స్థానిక బండారుపేటలో అంబేడ్కర్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి జగ్గిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా పార్టీ నూతన అధ్యక్షుడిగా నియమితులై తొలిసారిగా అంబేడ్కర్ జయంతి వేడుకల్లో పాల్గొనేందుకు విచ్చేసిన జగ్గిరెడ్డికి గ్రామ ముఖ ద్వారంలో తీన్‌మార్ వాయిద్యాలు, బాణసంచా కాల్పులు, పూలవర్షం నడుమ దళిత యువకులు, పెద్దలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆ మహనీయుని విగ్రహానికి జగ్గిరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు సలాది బ్రహ్మాజీ, గొల్లపల్లి శ్రీనివాసరావు, మట్టా బాబ్జి, ఏఎంసీ మాజీ చైర్మన్ పెదపూడి శ్రీనివాస్, పల్లి దిలీప్ తదితరులు పాల్గొన్నారు. మండల దళిత ఐక్యవేదిక, కూటమి పార్టీల సంయుక్త ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి ఘనంగా నిర్వహించారు. కొత్తపేట పాతబస్టాండ్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జనసేన ఇన్‌చార్జ్ బండారు సత్యానందరావు, రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. పలు ప్రభుత్వ కార్యాలయాలు, కళాశాలలు, పాఠశాలల్లో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు.

రావులపాలెంలో..

రావులపాలెం: అంటరానితనం, వివక్షపై అలుపెరగని పోరాటం చేసిన స్ఫూర్తి ప్రదాత అంబేడ్కర్ అని, ఆయన ఆశయ సాధనకు అందరూ పని చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా రావులపాలెం వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహానికి జగ్గిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు బొక్కా వెంకటలక్ష్మి, మండల కన్వీనర్ దొమ్మేటి అర్జునరావు, గొల్లపల్లి భాగ్యరావు, గొల్లపల్లి రాజశేఖర్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆర్టీసీ డిపో వద్ద, బస్టాండ్‌లో అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. అనంతరం కూచిపూడి నాట్యంలో గిన్నిస్ బుక్ ఆఫ్ ఆల్ రికార్డ్ సాధించిన రావులపాలెం డిపో కండక్టర్ ఎస్.



కొత్తపేట బండారుపేట వద్ద అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న **వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి**



పి.గన్నవరంలో అంబేడ్కర్ విగ్రహానికి **పూలమాలలు వేస్తున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి, ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ**



మలికిపురం పూలే-అంబేడ్కర్ భవనంలో అంబేడ్కర్‌కు పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే దేవ



రావులపాలెంలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డిపో మేనేజర్ రమణ



శృంగవరప్పాడులో అంబేడ్కర్ జయంతి వేడుకల్లో టాండన్‌రాజు

రామయ్య కుమార్తె ఎస్.ప్రగ్యాకు, ఇంటర్మీడియెట్ ఫస్టియర్‌లో అత్యధిక మార్కులు సాధించిన డ్రైవర్ ఎం.రమేష్ కుమార్తె రిత్వికకు అభినందనలు తెలిపారు. అలాగే నగదు బహుమతిని డిపో మేనేజర్ జీజీవీ రమణ అందజేశారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందరికీ ఆదర్శనీయుడని పి.గన్నవరం నియోజకవర్గం వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు శ్లాఘించారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా పాశర్లపూడి కొండాలమ్మచింత సెంటర్లో అంబేడ్కర్ విగ్రహానికి కో–ఆర్డినేటర్ శ్రీనివాసరావుతో పాటు పార్టీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడ ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను కట్ చేశారు. మామిడికుదురు సెంటర్లో విగ్రహానికి ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పూలమాల వేశారు. మగటపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలను దాత, జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు ఆవిష్కరించారు. అప్పనపల్లి కంకిపాటి సూర్యారావు, ఆదిలక్ష్మి మెమోరియల్ భవనంలో విగ్రహానికి వ్యవస్థాపకుడు, డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు పూలమాలలు వేశారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ నేతలు నెల్లి దుర్గాప్రసాద్, కొనుకు ప్రేమజ్యోతి, తోరం భాస్కర్, మొల్లేటి త్రిమూర్తులు, కశిరెడ్డి అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

మలికిపురంలో..

మలికిపురం: అంబేడ్కర్ ఆశయాలకు తగ్గట్టు నేటితరం మెలగాలని రాజోలు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గొల్లపల్లి సూర్యారావు అన్నారు. మలికిపురం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొల్లాబత్తుల సతీష్‌బాబు ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటం వద్ద గొల్లపల్లి పూలమాల వేసి, నివాళులర్పించారు. నాయకులు శెట్టిం శ్రీనివాస్, పాటి శివకుమార్, తాడి సహదేవ్, ఈద రవిరెడ్డి, మోకా సురేష్ తదితరులు పాల్గొన్నారు. మలికిపురం, సఖినేటిపల్లి మండలాల్లో పలు గ్రామాల్లో జరిగిన అంబేడ్కర్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్ట్ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఆయన విగ్రహాలకు ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సఖినేటిపల్లిలో..

సఖినేటిపల్లి: అంబేడ్కర్ జయంతి పురస్కరించుకుని శృంగవరప్పాడులో ఆయన విగ్రహానికి మహిమా కోకోనట్ ప్రొడ్యూసర్స్ కంపెనీ చైర్మన్ ఒగూరి టాండన్‌రాజు పూలమాల వేసి నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్ అని కూడా ఆయన పేర్కొన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కె.సూర్యనారాయణ ఆధ్వర్యంలో, సఖినేటిపల్లి మొక్కతోట ఏరియాలో అంబేడ్కర్ జయంతి వేడుకల్లో సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు, మాజీ సర్పంచ్‌లు సరెళ్ళ విజయ్ ప్రసాద్, తోటి ప్రతాప్ పాల్గొన్నారు.

రాజోలులో..

రాజోలు: రాజోలు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంబేడ్కర్ జయంతిలో న్యాయమూర్తి ప్రమీలరాణి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వైఎస్ఎస్ఏ నాయుడు, ప్రధాన కార్యదర్శి చింతా ప్రసాద్, ఉపాధ్యక్షుడు యాలంగి రమేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే అంబేడ్కర్ కమ్యూనిటీ హాలు వద్ద ఉన్న అంబేడ్కర్ చిత్రపటానికి రాజోలుకు చెందిన ముఖ్య నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజోలు సుందరమ్మ చెరువు గట్టు, ఐడియల్ యూత్, శివకోడు, పొదలాడ ఇందిరా కాలనీ, తాటిపాక, వేగివారిపాలెం గ్రామాలో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు.

అంబేడ్కర్ అడుగుజాడల్లో పయనించాలి

అంబాజీపేట: భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్, మండల మాల మహానాడు అధ్యక్షుడు నాగవరపు నాగరాజు, దళిత సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ వద్ద, నాలుగు రోడ్లు సెంటర్‌లో అంబాజీపేట అంబేడ్కర్ విగ్రహానికి జెడ్పీటీసీ, నియోజకవర్గ కో ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావుతో పాటు పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, మాచవరంలో సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి ఆధ్వర్యంలోను, తొండవరం వెన్నపువారి కాలనీలోను, అన్ని గ్రామాల్లోనూ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, పీకే రావు, దొమ్మేటి సత్యమోహన్, మందపాటి కిరన్‌కుమార్, చింతపల్లి వెంకటేశ్వరరావు, వెన్నపు రాంబాబు పాల్గొన్నారు.

ఆలమూరులో..

ఆలమూరు: అంబేడ్కర్ ఆశయాలు, ఆలోచన విధానాలు దేశానికి ఆదర్శప్రాయమని ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎ.రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన అంబేడ్కర్ జయంతిలో వారు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి, అంటరానితనం నిర్మూలనకు ఆయన చేసిన సేవలు మరువలేమన్నారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

అయినవిల్లిలో..

అయినవిల్లి: అంబేడ్కర్ అడుగుజాడల్లో నేటి యువత ప్రయనించాలని అప్పుడే దేశం ప్రగతి వైపు ప్రయాణిస్తుందని పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, ఎస్సై శాస్త్రి అన్నారు. ముక్తేశ్వరం సెంటర్‌లో అంబేడ్కర్ జయంతి వేడుకలను వరసిద్ధి వినాయక ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా జరిపారు. ఈ వేడుకల్లో ఎస్సై శాస్త్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అలాగే మండలంలోని వివిధ గ్రామాల్లో పార్టీ నాయకుల ఆధ్వర్యంలో జరిగిన అంబేడ్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. ఎస్.మూలపాలెంలో బీజేపీ నాయకులు చీకురుమిల్లి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి జరిపారు.

ఎస్సీ వర్గీకరణపై నిరసన



ర్యాలిలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న కప్పల శ్రీధర్ తదితరులు

కొత్తపేట: బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకల్లో దళితులు నల్ల బ్యాడ్జీలు ధరించి ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం జిల్లా శాఖ మాజీ అధ్యక్షుడు కప్పల శ్రీధర్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. కేక్ కట్‌చేసి అందరికీ పంచారు. అనంతరం దళిత నాయకులు, కార్యకర్తలు ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియేస్తూ నినాదాలు చేశారు. ఓ పక్క అంబేడ్కర్ ఆలోచనా విధానమే తమ విధానమంటూ మరో పక్క అన్నదమ్ములుగా ఉన్న మాల మాదిగలను విభజించి మంటకాగడమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నాయన్నారు. శాస్త్రీయ విధానాన్ని అవలంబించకుండా ఇష్టానుసారంగా వ్యవహరించడానికి వ్యతిరేకంగా భవిష్యత్‌లో జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిరసనల ద్వారా ఈ ప్రభుత్వాలకు త్వరలోనే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో దళిత నాయకులు పాల్గొన్నారు.

వేపచెట్టు దుర్గమ్మకు శాశ్వత గద్దె



అమలాపురంలో వేప చెట్టు కనకదుర్గమ్మకు శాశ్వత గద్దె నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న భక్తులు

అమలాపురం టౌన్: స్థానిక కల్వకొలను వీధిలో వేంచేసిన వేప చెట్టు కనకదుర్గమ్మ ఆలయం వద్ద నూతనంగా నిర్మించనున్న అమ్మవారి శాశ్వత గద్దెకు భక్తులు సోమవారం శాస్త్రోక్తంగా శంకుస్థాపన చేశారు. ఆ ప్రాంతానికి చెందిన ఆడపడుచుల సమక్షంలో ఈ శంకుస్థాపన పూజలు చేశారు. శతాబ్దాల చరిత్ర గల ఈ వేపచెట్టు అమ్మవారికి ఏటా శ్రావణమాసం పౌర్ణమి ముందు వచ్చే గురువారం సంబరాలతో అమ్మవారి గద్దె నుంచి ఊరేగింపు నిర్వహిస్తారు. ఇప్పటి వరకూ అమ్మవారి గద్దెను తాత్కాలికంగా ఏర్పాటు చేసేవారు. త్వరలో అమ్మవారికి శాశ్వత గద్దె నిర్మితమవుతుందని భక్తులు తెలిపారు. వచ్చే శ్రావణ మాసం ఉత్సవాల నాటికి గద్దె నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, పెద్దలు పిండి వెంకయ్య, కల్వకొలను బాబు, బోణం అప్పారావు, బెజవాడ సత్తిబాబు పాల్గొన్నారు.

అనధికార మద్యం షాపుల నిర్వాహకులపై కేసు

అమలాపురం రూరల్: జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో కామనగరువులో నవోదయం 2.0లో భాగంగా సారా నిర్మూలనపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. అమలాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఐదు మండలాల్లో జనవరి 1 నుంచి ఏప్రిల్ 14 వరకు 39 మంది అనధికార మద్యం షాపుల నిర్వాహకులపై కేసులు నమోదు చేసినట్టు సీఐ వీటీవీపీ సత్యనారాయణ తెలిపారు తెలిపారు. వివిధ కేసుల్లో పాత ముద్దాయిలు 122 మందిని తహసీల్దార్ల వద్ద బైండోవర్ చేసినట్లు తెలిపారు.

ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం



బాధితుడికి సాయం అందజేస్తున్న సంస్థ సభ్యులు

రావులపాలెం: ప్రమాదంలో గాయపడిన బాధితుడికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు సోమవారం రూ.13,500 ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఆలమూరు మండలం పెదపళ్ల గ్రామానికి చెందిన సుంకర శ్రీనివాస్ ఎనిమిది నెలల క్రితం వర్షం పడుతున్న సమయంలో పాకలో ఉన్నాడు. గాలికి పాక కూలిపోయి పాక దూలం ఇతని నడుం మీద పడిపోవడంతో నడుం కింద నుంచి పనిచేయడం మానేసింది. మంచం మీదే ఉంటున్నాడు. ఇతనికి తల్లిదండ్రులు లేరు. భార్య పిల్లలు దూరంగా ఉంటున్నారు. దీంతో పిన్ని ఇంటి దగ్గర ఉంటున్నారు ఆవిడకి భర్త లేకపోవడంతో ఇతనికి వైద్యం చేయించే ఆర్థికస్తోమత లేక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. పెదపళ్ల వెళ్ళి సుంకర శ్రీనివాస్‌కి సంస్థ సభ్యుల చేతుల మీదుగా నగదు చెక్కు అందజేశారు.

పెన్షనర్ల సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక



పెన్షనర్ల సంఘం నూతన కార్యవర్గంతో జిల్లా సంఘ నాయకులు

కొత్తపేట: స్థానిక తాలూకా ప్రభుత్వ పెన్షనర్ల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం స్థానిక సంఘ భవనంలో అధ్యక్షుడు ఏడిద సత్తిరాజు అధ్యక్షతన సంఘ సమావేశం జరిగింది. ప్రధాన కార్యదర్శి అజ్జరపు వెంకటసుబ్బారావు నివేదికను సభ ముందుంచారు. అనంతరం సత్తిరాజు మాట్లాడుతూ ప్రస్తుత కార్యవర్గం ఎన్నికై మూడేళ్లు అయినందున నూతన కార్యవర్గ ఎన్నిక ఆవశ్యకతను ప్రతిపాదించారు. 160 మంది సభ్యులు హాజరు కాగా వారి నుంచి ఒకే ప్యానల్ రావడంతో సంఘ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా అజ్జరపు వెంకటసుబ్బారావు, అధ్యక్షుడిగా కాశి రాజేంద్రప్రసాద్, అసోసియేట్ అధ్యక్షుడిగా మాకే నరసింహమూర్తి, ప్రధాన కార్యదర్శిగా ఏడిద సత్తిరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా వైసీ రామన్న, కోశాధికారిగా బ్రహ్మానందం, ముఖ్య సలహాదారులుగా నల్లా అచ్చుతరామయ్య, దాట్ల సూర్యనారాయణరాజు, ఆరుగురు ఉపాధ్యక్షులు, ఆరుగురు ఉప కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గంతో జిల్లా సంఘ సభ్యులు ప్రమాణ స్వీకారం చేయించారు.

నంది పురస్కారం అందుకున్న సత్యనారాయణ



నంది పురస్కారం అందుకున్న సత్యనారాయణ

మామిడికుదురు: నగరం గ్రామానికి చెందిన ప్రముఖ బుర్రకథ ప్రధాన కథకుడు మంగం సత్యనారాయణ వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించే వారికి అందించే మహానంది పురస్కారాన్ని అందుకున్నారు. విశాఖపట్నంలో జరిగిన సమావేశంలో ఏఎన్ఎస్–24 టీవీ ఈ పురస్కారంతో తనను సత్కరించిందని సోమవారం స్థానిక విలేకరులకు తెలిపారు. ఉగాది పురస్కారాల్లో భాగంగా నంది పురస్కారంతో పాటు ప్రశంసా పత్రం అందించి శాలువాతో సత్కరించారన్నారు. సినీ దర్శకుడు అనుమాండ్ల నాగరాజు, టీవీ అశోక్ కుమార్, ప్రముఖ రచయిత్రి డాక్టర్ వనపర్తి పద్మావతి చేతుల మీదుగా సత్యనారాయణ నంది పురస్కారం, సన్మానం అందుకున్నారు. అవార్డు అందుకున్న సత్యనారాయణను పలువురు స్థానిక కళాకారులు అభినందించారు.

అగ్నిప్రమాదంలో తాటాకిల్లు దగ్ధం



అగ్నిప్రమాదంలో కాలిపోయిన తాటాకిల్లు

మామిడికుదురు: గోగన్నమఠం నల్లివారి మెరక అరుంధతీపేటలో సోమవారం జరిగిన అగ్నిప్రమాదంలో తాటాకిల్లు దగ్ధమైంది. రెండు కుటుంబాల వారు కట్టుబట్టలతో వీధిన పడ్డారు. ఈ ప్రమాదంలో ఉప్పాటి సుభద్ర, చింద్రపు సత్యవతి కుటుంబాలు సర్వం కోల్పోయాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు రాజోలు అగ్నిమాపక కేంద్రం సిబ్బందికి సమాచారం అందించారు. స్థానికులు సైతం మంటలు పక్క ఇళ్లకు వ్యాపించకుండా చర్యలు తీసుకున్నారు. సమాచారం అందుకున్న రాజోలు అగ్నిమాపక కేంద్రం సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటల్ని అదుపు చేశారు. ఆస్తి నష్టం సుమారు రూ.2.50 లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు బాధితులను పరామర్శించారు.

వెటరన్ క్రీడాకారుడు వీర్రాజు మృతి

అమలాపురం టౌన్: వెటరన్ క్రీడాకారుడు బిళ్ల వీర్రాజు (74) అనారోగ్యంతో సోమవారం ఉదయం మృతి చెందారు. ఏడు పదుల వయస్సులోనూ వీర్రాజు 20 లాంగ్ జంప్, హైజంప్, పరుగు పందెంలో సత్తా చాటే వారు. అమలాపురానికి చెందిన వీర్రాజు దేశంలో పలు రాష్ట్రాల్లో నిర్వహించిన వెటరన్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని అనేక బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. తన క్రీడా ప్రస్థానంలో వీర్రాజు దాదాపు 100కి పైగా వివిధ పతకాలు సాధించారు. చిన్నతనం నుంచి క్రీడలపై మక్కువతో వెటరన్ క్రీడాకారుడిగా పలు పోటీల్లో పాల్గొని సత్తా చాటారు. ఆయన ఉపాధి కోసం పట్టణంలోని ఓ వస్త్ర దుకాణంలో సూపర్‌వైజర్‌గా పనిచేశారు. కరోనా తర్వాత ఆరోగ్యం క్షీణించి ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటున్నారు. వీర్రాజుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. వీర్రాజు మృతికి స్థానిక చందన బ్రదర్స్ వస్త్రాలయం మేనేజర్ దొంతంశెట్టి శ్రీధర్, పట్టణానికి చెందిన వెటరన్ క్రీడాకారులు మెహబూబ్ సిస్టర్స్ షహీరా, షకీలా సంతాపం తెలిపారు.